సాక్షి
అన్నమయ్య జిల్లా
బుధవారం । 14 । జూన్ । 2023



ప్రైవేట్ బస్సులో నుంచి జారిపడి కండక్టర్ మృతి

వేగంగా వెళుతున్న ప్రైవేట్ బస్సులో నుంచి జారిపడి పి.జాఫర్‌ఖాన్(65) అనే కండక్టర్ మృతి చెందాడు. - 8లో



రక్త సారథులు..ప్రాణ వారధులు

రక్తం ఎంత విలువైందో అందరికీ తెలిసిందే. ప్రాణాపాయంలో ఉన్నవారిని ఆదుకునేందుకు కొంత మంది రక్తదాతలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.320	రూ.440
రెండోరకం	రూ.230	రూ.310



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 909 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	395	520
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 1075.40 కిలోలు

న్యూస్‌రీల్

శుభ్రత పాటించకుంటే చట్టపరమైన చర్యలు



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారి

రాయచోటిటౌన్ : శుభ్రత, నాణ్యత ప్రమాణాలు పాటించకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి డాక్టర్ షమీం బాషా హోటళ్ల యజమానులను హెచ్చరించారు. మంగళవారం రాయచోటి పట్టణం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని పలు హోటళ్లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. హోటళ్లలోని ఆహార పదార్థాల శాంపిల్స్ సేకరించారు. హోటళ్లలో నాణ్యత, శుభ్రత విషయంలో రాజీ పడే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు.

రైతులు మల్బరీ పంటలను సాగు చేయాలి

సిద్దవటం: మండలంలోని రైతులు మల్బరీ పంటలను సాగుచేస్తే రైతులకు సబ్సిడీ మంజూరు చేస్తామని జిల్లా పట్టుపరిశ్రమల శాఖ అధికారి శ్రీనివాసులరెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటంలో చెన్నారెడ్డి , మోదీన్‌సాబ్ పల్లె గ్రామంలో హరి అనే రైతులు సాగుచేసిన మల్బరీ పంటను, పట్టు పరిశ్రమ షెడ్లను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక ఎకరాకు దాదాపు 10 టన్నుల ఎరువును మల్బరీ పంటలో వేయాలన్నారు. దానివల్ల పంట దిగుబడి మెండుగా వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టు పరిశ్రమల శాఖ టెక్నికల్ అధికారి వెంకటరామరాజు, రైతులు పాల్గొన్నారు.


రాష్ట్ర హాకీ జూనియర్స్ వైస్ కెప్టెన్‌గా అఖిల్‌వెంకట్



మదనపల్లె : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హాకీ జూనియర్స్ వైస్ కెప్టెన్‌గా మదనపల్లెకు చెందిన నడిమింటి అఖిల్‌వెంకట్ ఎంపికయ్యారు. బుధవారం హైదరాబాదు గచ్చిబౌలి స్టేడియం హాకీ కాంప్లెక్స్‌లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 14, 15 తేదీల్లో రెండురోజుల పాటు 12–18 ఏళ్ల వయస్సు కలిగిన జూనియర్స్ క్రీడాకారులకు జరిగే హాకీ టోర్నమెంట్‌లో రాష్ట్ర జట్టుకు అఖిల్ వెంకట్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తారు. ఇటీవల రూర్కెలా, ఒడిశాలో జరిగిన 13వ హాకీ ఇండియా జూనియర్స్ మెరిట్ నేషనల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనపరిచి రాష్ట్రజట్టుకు అఖిల్ వెంకట్ ఎంపికయ్యాడు. పట్టణ శివారు పంచాయతీ తట్టివారిపల్లె బాలాజీనగర్‌కు చెందిన అఖిల్‌వెంకట్ తండ్రి శ్రీనివాసులు అన్నమయ్య జిల్లా పీటీఎం మండలంలో హౌసింగ్ ఏఈగా పనిచేస్తున్నారు.

అన్నదాతకు వెన్నుదన్ను

- జిల్లాలో సుమారు లక్ష హెక్టార్లలో ఖరీఫ్ పంటల సాగుకు అంచనా
- ఇప్పటికే సుమారు 45 వేల క్వింటాళ్ల మేర సబ్సిడీ వేరుశనగకాయల పంపిణీ
- ఖరీఫ్‌కు ముందే రైతు భరోసా కింద రైతులకు రూ. 151 కోట్ల నిధులు
- సాగును ప్రోత్సహించడంలో భాగంగాసబ్సిడీపై 160 ట్రాక్టర్లను అందించిన ప్రభుత్వం
- రైతులకు అందుబాటులో సిద్ధంగా ఎరువులు





సాక్షి రాయచోటి : ఖరీఫ్ సాగు కంటే ముందే అన్నదాతలకు ప్రభుత్వం అండగా నిలబడుతోంది. సాగుకు అవసరమైన అన్ని విధాలుగా తోడ్పాటును అందిస్తోంది. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జూన్‌లో వర్షాలు పడితే పంటలు వేసేందుకు రైతులు ఓవైపు సన్నద్ధమవుతున్నారు. మరోవైపు ప్రభుత్వం వారికి పూర్తి స్థాయిలో అవసరమైన అన్ని అవసరాలను అందించి సిద్ధం చేసింది. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా సుమారు లక్ష హెక్టార్లలో పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ ప్రణాళికలు రూపొందించింది. ప్రధానంగా వరితోపాటు వేరుశనగ, మినుములను సాగు చేస్తారు. అయితే ఖరీఫ్‌లో అన్నదాతకు సాగు పెట్టుబడి సమస్య లేకుండా రైతు భరోసా మొదలుకొని యంత్ర పరికరాలు, విత్తనాలు, ఎరువులు అన్నింటినీ సమకూరుస్తోంది.

సాగుకు రైతు భరోసా సాయం

జిల్లాలో ఖరీఫ్ సాగుకు సన్నద్ధమైన అన్నదాతలకు పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం రైతు భరోసా సొమ్ములను కూడా అందించింది. ఒక్కొక్కరికి రూ. 7500 చొప్పున రైతు భరోసా కింద జిల్లాలో 2,02,094 మంది రైతులకు రూ. 151.95 కోట్లను మే నెలలోనే రైతుల చేతికి అందించింది. పంటలు పెట్టే రైతులకు ముందస్తుగానే అందించడం ద్వారా ఎంతోకొంత ప్రయోజనం ఉంటుందని ప్రభుత్వం భావించింది.

యంత్ర పరికరాలు అందజేత

అన్నమయ్య జిల్లాలో గతేడాది 240 ట్రాక్టర్లతో పాటు ఇతర యంత్రాలను అందించిన జగన్ సర్కార్ ఈసారి ఖరీఫ్ సాగుకు ముందే వ్యవసాయాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా యంత్రపరికరాలు అందించింది. జిల్లా వ్యాప్తంగా ఈసారి కూడా జూన్ నెలలో 160 ట్రాక్టర్లతోపాటు 370 యంత్ర పరికరాలను సబ్సిడీతో గ్రూపులకు అందజేసింది. రైతు గ్రూపులకు సంబంధించి ట్రాక్టర్లు, యంత్ర పరికరాలు అందించడం ద్వారా పొలాల్లో సేద్యాలు, ఇతర పనులకు అనువుగా ఉంటుందని ప్రభుత్వం ఈ ప్రోత్సాహం అందిస్తోంది.

45 వేల క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ



జిల్లాలో లక్ష హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ అంచనాలు రూపొందించి అందుకు అనుగుణంగా సబ్సిడీపై విత్తనాలను అందిస్తోంది. జిల్లా వ్యాప్తంగా 45 వేల టన్నుల వేరుశనగ కాయలను ఇప్పటికే డివిజన్ల వారీగా పంపిణీ చేసిన వ్యవసాయశాఖ మరో ఐదు వేల టన్నులు తెప్పించేందుకు కసరత్తు చేస్తోంది. అంతేకాకుండా మరికొన్ని పంటలకు సంబంధించి కూడా సబ్సిడీపై విత్తనాలను సాగుకు అనుకూలంగా అందిస్తున్నారు.

రైతుకు కావాల్సినన్ని ఎరువులు



ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో జూన్, జులైలో వర్షాలను బట్టి అన్నదాతలు పంటలు వేస్తారు. అయితే వ్యవసాయశాఖ విత్తనాలతోపాటు ఎరువులను కూడా సిద్ధం చేసింది. జిల్లా వ్యాప్తంగా రైతు భరోసా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్న రైతులకు ఎరువులను కూడా అందిస్తున్నారు. సుమారు 86 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు జిల్లాలో ఉన్నాయి. అవసరమైన రైతులందరికీ అందించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు. ఎక్కడికక్కడ గోడౌన్లలో యూరియా, డీఏపీ, పొటాష్ తదితర రకాల ఎరువులు నిల్వ ఉంచారు.

ఖరీఫ్ కంటే ముందే అన్నదాతకు సహకారం



రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్ సీజన్ కంటే ముందే అన్నదాతలకు అన్నీ సమకూర్చుతోంది. రైతు భరోసా సొమ్ములు మొదలుకొని వాహనాలు, ఎరువులు, విత్తనాలు అందిస్తున్నారు. ఖరీఫ్ సీజన్ మొదట్లోనే వర్షాలు పడగానే విత్తుకునేందుకు అవసరమైన ముందస్తు సన్నద్ధతను కల్పిస్తోంది. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించడంలో భాగంగా అన్నీ సరైన సమయంలోనే అందజేస్తున్నారు.

– గిరీషా పీఎస్, కలెక్టర్, అన్నమయ్య జిల్లా

ఇంటర్ సప్లిమెంటరీలో మెరుగైన ఫలితం

- ప్రథమ ఇంటర్‌లో 63.32 శాతం, ద్వితీయ ఇంటర్‌లో 75.95 శాతం ఉత్తీర్ణత
- రెగ్యులర్‌కంటే అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీలో మెరుగుపడిన ఫలితాలు
- ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో రాష్ట్రంలో 13వ స్థానం

కడప ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా మే నెల 24వ తేదీ నుంచి 31వ తేదీ వరకు నిర్వహించిన ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు మంగళవారం సాయంత్రం ప్రభుత్వం విడుదల చేసింది. ఉమ్మడి వైఎస్సార్ జిల్లా ప్రథమ సంవత్సరం ఫలితాల్లో 13వ స్థానంలో నిలువగా ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో కూడా అదే స్థానంలో నిలిచింది. ప్రథమ సంవత్సరంలో 17,663 మంది పరీక్ష రాయగా 11,185 మంది ఉత్తీర్ణులై 63.32 శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే ద్వితీయ సంవత్సరంలో 16,443 మంది పరీక్ష రాయగా 12,488 మంది ఉత్తీర్ణులై 75.95 శాతం ఉత్తీర్ణత పొందారు. కాగా మార్చి నెలలో జరిగిన ఇంటర్ పరీక్షల్లో ప్రథమ సంవత్సరంలో 46 శాతం, ద్వితీయ సంవత్సరంలో 60 శాతం ఉత్తీర్ణత సాధించారు. విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడంలో భాగంగా పరీక్షలను కట్టుదిట్టంగా జరపడంతో కొంత ఉత్తీర్ణత శాతం తగ్గిందని భవిష్యత్తులో మరింత మెరుగైన ఫలితాలను సాధించేందుకు కృషి చేస్తామని ఆర్‌ఐఓ రమణరాజు తెలిపారు.

నేడు జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశం

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశం బుధవారం ఉదయం 9 గంటలకు జెడ్పీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు సీఈఓ సుధాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఏడు స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహిస్తున్నారని, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి జెడ్పీటీసీలు, ఇతర గౌరవ సభ్యులు హాజరు కావాలన్నారు. ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ఉన్నందువల్ల సభ్యులంతా 9.00 గంటలకే హాజరు కావాలని ఆయనసూచించారు.

నిర్ణీత గడువులోగా పనులన్నీ పూర్తి కావాలి



మాట్లాడుతున్న రాష్ట్ర ప్లానింగ్ సెక్రటరీ విజయకుమార్, జిల్లా కలెక్టర్ విజయరామరాజు

పులివెందుల రూరల్: పులివెందుల మోడల్ టౌన్‌లో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులన్నీ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్లానింగ్ సెక్రటరీ విజయకుమార్, జిల్లా కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడల్ టౌన్ అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి పెట్టారని అందువల్ల ఈ పనులలో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలన్నారు. అలాగే జులై 8వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పులివెందుల పర్యటనలో భాగంగా ఆయన ప్రారంభించే పనులన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, ఆర్డీఓ వెంకటేశులు, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, అన్ని శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల సొసైటీలను బలోపేతం చేయండి

జిల్లాలో పాడి రైతుల సొసైటీలను బలోపేతం చేసేలా అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. జగనన్న పాల వెల్లువ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాల ధరలు పెరిగిన నేపథ్యంలో వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

ప్రశాంతంగా కేజీబీవీ ఉద్యోగుల బదిలీలు

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి వైఎస్సార్ జిల్లావ్యాప్తంగా మంగళవారం సాయంత్రం కడప డీఈఓ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన కేజీబీవీ ఉద్యోగుల బదిలీ ప్రక్రియ ప్రశాంతంగా జరిగింది. ఈ బదిలీల కార్యక్రమంలో డీఆర్‌ఓ గంగాధర్‌గౌడ్, డీఈఓ రాఘవరెడ్డి, సమగ్రశిక్ష జిల్లా పథక అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి, డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న 29 కేజీబీవీల్లో పనిచేస్తున్న ప్రిన్సిపాల్స్, సీఆర్‌టీలు, నాన్ టీచింగ్ సిబ్బంది తమ అర్హతను బట్టి 90 మంది బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 85 మంది హాజరుకాగా అందులో వారి అర్హతలను బట్టి 60 మందిని వివిధ కేజీబీవీలకు బదిలీ చేశారు. ఈ కార్యక్రమంలో జీసీడీఓ విజయ, ఎస్‌ఎస్‌ఏ సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తు అందగానే వ్యవసాయ కనెక్షన్

ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్ రావు



సమావేశంలో మాట్లాడుతున్న సీఎండీ సంతోష్ రావు, పక్కన శ్రీనివాసరావు, కృష్ణారెడ్డి, గురవయ్య

బి.కొత్తకోట: వ్యవసాయ బోర్లకు కనెక్షన్ల కోసం రైతుల నుంచి దరఖాస్తులు అందగానే చర్యలు తీసుకుంటామని ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ కె.సంతోష్ రావు అన్నారు. మంగళవారం బి.కొత్తకోట మండలంలోని హార్సిలీహిల్స్ కాన్ఫరెన్స్ హాలులో డిస్కం ఉన్నతాధికారులు, ఈఈ, డీఈ, ఏఈలతో విద్యుత్ సరఫరా, వ్యవసాయ కనెక్షన్ల పై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇకపై ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్‌లో ఉండదని స్పష్టం చేశారు. వ్యవసాయం, గృహ, పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. విద్యుత్ సమస్యల తక్షణ పరిష్కారం కోసం 1912 కాల్ సెంటర్ నెంబర్ ఏర్పాటు చేశామన్నారు. గతంకంటే ప్రస్తుతం ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యం పూర్తిగా తగ్గుముఖం పట్టిందన్నారు. సమావేశంలో తిరుపతి ఎస్‌ఈ కృష్ణారెడ్డి, కడప ఓఎస్డీ శ్రీనివాసులు, చీఫ్ జనరల్ మేనేజర్ గురువయ్య, ఈఈ రాజశేఖర్‌రెడ్డి, డీఈ గంగాధరం, డీఈ, ఏఈలు, విభాగాల అధికారులు పాల్గొన్నారు.

- అలాగే పీలేరులోని ఎంఎస్ఆర్ గార్డెన్స్‌లో విద్యుత్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం గురవయ్య, ఓఎస్డీ శ్రీనివాసులు, ఎస్ఈ కృష్ణారెడ్డి, ఈఈ మునిచంద్ర, డీఈఈలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

పరనింద.. ఆత్మస్తుతి.!

- అధికారపక్షంపై అక్కసు.. సొంత డబ్బాకే పరిమితమైన నారా లోకేష్
- ఈవెనింగ్ వాక్‌ను తలపించిన యువగళం పాదయాత్ర
- ప్రతి సభలోనూ అబద్ధపు మాటలే
- జిల్లాలో పక్షం రోజులు ఇదే రీతిలో సాగిన వైనం

సాక్షి ప్రతినిధి, కడప: 'ప్రజల కష్టాలు తెలుసుకుందామంటే ప్రజలెవ్వరూ దరిదాపులకు రాలేదు. 14 ఏళ్ల అధికారం వెలగబెట్టినా ఈ జిల్లాకు ఒరగబెట్టింది ఏమీ లేదు. చెప్పుకునేందుకు చేసిన కనీస అభివృద్ధి లేదు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ జిల్లాలో యువగళం పాదయాత్ర విజయవంతం బాధ్యత ఆయా నియోజకవర్గ ఇన్‌చార్జిలకు అప్పగించారు. అరువు తెచ్చిన జనాలతో రక్తికట్టించే జాగ్రత్తలైతే తీసుకున్నారు. కానీ హాజరైన వారినైనా ఆకట్టుకునే చర్యలకు ఉపక్రమించారా అంటే అదీ లేదు. ఎవరో రాసి ఇచ్చిన స్క్రిప్ట్ కూడా సరిగా చదవడం రాలేదు. వెరసి ఈవెనింగ్ వాక్‌ను మరిపించేలా యువగళం పాదయాత్ర కొనసాగింది. పక్షం రోజుల పాటు ఇక్కడ పర్యటించిన టీడీపీ నేత నారా లోకేష్ ఇక చేసేది.. చెప్పేది ఏమీలేక 'ఆత్మస్తుతి..పరనింద'కు ప్రాధాన్యత ఇస్తూ తన పర్యటన ముగించుకుని వెళ్లారు. అధికారంలో ఉన్నప్పుడు నలుగురికి మంచి చేసినా, ప్రాంతాన్ని అభివృద్ధి చేసినా ప్రజలు గుర్తు పెట్టుకోవడం సహజం. అయితే తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న 14 ఏళ్లు వైఎస్సార్ జిల్లా వివక్షకు గురైంది. ఒక్కమాటలో చెప్పాలంటే చంద్రబాబు హయాం మొత్తం జిల్లాకు చంద్రగ్రహణం పట్టిందనే చెప్పాలి. నిర్దిష్టమైన అభివృద్ధి చేపట్టకపోగా, పైగా జిల్లాపై, ఇక్కడి ప్రజానీకంపై విషం గక్కారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడ ఎలాంటి ఘటన చోటుచేసుకున్నా 'కడప గూండాలు, పులివెందుల రౌడీలంటూ' అభాండాలు వేస్తూ, ఆత్మాభిమానంపై దెబ్బకొట్టారు. అధికారంలో లేనప్పుడు మాత్రం ఈ జిల్లాపై 'మొసలి కన్నీరు' కార్చడం ఆనవాయితీగా పెట్టుకున్నారు. ఈ విషయంలో' పెదబాబు–చినబాబు ఇద్దరూ ఇద్దరే' అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని రాజకీయ విశ్లేషకులు సైతం వెల్లడిస్తున్నారు.



పాదయాత్రకు కొత్త భాష్యం...

ప్రజలు ప్రభుత్వం వద్దకు వెళ్లి వారి సమస్యలు చెప్పుకోలేని స్థితి, చెప్పుకున్నా పరిష్కారం లభించని పరిస్థితుల్లో నాయకులే ప్రజల దగ్గరికి వెళ్లి వారి సమస్యలు తెలుసుకొని వాటికి పరిష్కార మార్గం చూపించడం పాదయాత్ర ముఖ్య ఉద్దేశం. అయితే నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు కొత్త భాష్యం చెప్పారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభించి, 10.30 గంటలలోపు ముగింపు పలికారు. 'నాడు పెదబాబు రాత్రిళ్లు లాంతరు లైటింగ్‌లో పాదయాత్ర చేపట్టగా, నేడు చినబాబు ఈవెనింగ్ వాక్‌ను తలపించేలా జిల్లాలో పక్షం రోజులు తిరిగారు. ఇక ఏ నియోజకవర్గానికి వెళితే అక్కడ ప్రజాప్రతినిధులను టార్గెట్ చేయడమే అసలు పనిగా పెట్టుకున్నారు. ఆరోపణలకు తగిన ఆధారాలు చూపకపోగా బురద జల్లి పోవడమే లక్ష్యంగా ప్రసంగం కొనసాగింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ అభివృద్ధి సాధించామని చెప్పుకునేందుకు అవకాశం లేకపోవడంతో పదేపదే అనంతపురం జిల్లాలోని 'కియా' కార్ల పరిశ్రమ గురించి ఊదరగొట్టారు.

తండ్రికి తగ్గ తనయుడుగా..

అబద్ధాలు వల్లించడంలో తండ్రికి తగ్గ తనయుడుగా నారా లోకేష్ జిల్లాలో పేరు పొందారు. అందుకు ప్రత్యక్ష ఉదాహరణగా కడప స్టీల్ ప్లాంట్‌ను చెప్పుకోవచ్చు. రాష్ట్ర విభజన చట్టంలో కడపలో ఉక్కు పరిశ్రమ నెలకొల్పాలని పొందుపర్చినా ఐదేళ్ల కాలంలో టీడీపీ సర్కార్ ఉక్కు పరిశ్రమ ఊసే ఎత్తలేదు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వంతో తెగదెంపులు చేసుకున్న తర్వాత 2018 డిసెంబర్ 27న కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం మైలవరం మండలం కంబాలదిన్నె గ్రామం వద్ద సీఎం హోదాలో చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేశారు. సరిగ్గా ఎన్నికలకు 3 నెలల ముందు శంకుస్థాపనతో సరిపెట్టారు. టీడీపీ సర్కార్ స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం కృషి చేస్తే, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ పట్టించుకోలేదనే విమర్శలు నారా లోకేష్ చేయడం విడ్డూరంగా ఉందని పరిశీలకులు పేర్కొంటున్నారు. అధికారంలోకి వచ్చిన రెండేళ్లు తీవ్రమైన కరోనా వైరస్‌ను ఎదుర్కొని ప్రజలను రక్షించుకునే పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉండిపోయింది. తర్వాత ప్రఖ్యాత స్టీల్ ప్లాంట్ జేఎస్‌డబ్ల్యు సంస్థ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు భూమి పూజ చేశారు. పరిశ్రమ నెలకొల్పేందుకు అనువైన మౌలిక వసతుల కోసం రూ.725 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం వెచ్చించి వసతులు సమకూర్చింది. రూ.3300 కోట్ల పెట్టుబడితో తొలివిడత నిర్మాణానికి జేఎస్‌డబ్ల్యు అధినేత సజ్జన్ జిందాల్ శ్రీకారం చుట్టారు. అలాగే జిల్లాలోని గండికోట, రాజోలి రిజర్వాయర్, నెల్లూరు జిల్లాలోని సోమశిల ప్రాజెక్టు పట్ల కూడా నారా లోకేష్ అవగాహన లేమి స్పష్టంగా తేటతెల్లమైందని పలువురు వివరిస్తున్నారు.

పక్కా ప్రణాళిక ప్రకారమే..

యువగళం విజయవంతం చేసేందుకు పక్కా ప్రణాళికాబద్ధంగా టీడీపీ పావులు కదిపింది. ఓవైపు జనాలను తరలించే భారాన్ని భరిస్తూనే, మరోవైపు నారా లోకేష్ అండ్ టీమ్‌కు ఖర్చులకు రోజుకు రూ.7లక్షల చొప్పున నియోజకవర్గ ఇన్‌చార్జిలు చెల్లించాల్సి వచ్చిందని వినికిడి. నారా లోకేష్ 'జాలీ'గా యాత్ర చేస్తుంటే వ్యయ ప్రయాసలకు లోనైన ఇన్‌చార్జిల వైపు 'జాలి'గా చూడటం పార్టీ శ్రేణుల వంతైంది. జమ్మలమడుగు మొదలుకొని ప్రొద్దుటూరు, మైదుకూరు, చెన్నూరు, సిద్దవటం, బద్వేల్ ప్రాంతాల్లో బహిరంగ సభల నిర్వహణకు కూడా పథకం ప్రకారం ఇరుకు సందులనే ఎంచుకోవడం విశేషం.

బలోపేతం కాకపోగా.. వర్గాలకు ఆజ్యం

నారా లోకేష్ యువగళం కార్యక్రమం వల్ల తెలుగుదేశం పార్టీకి బలం చేకూరకపోగా, వర్గ విభేదాలకు ఆజ్యం పోశారని ఆ పార్టీ నేతలే విమర్శిస్తున్నారు. ప్రొద్దుటూరులో ఇన్‌చార్జి గండ్లూరు ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని ఆకాశానికెత్తి, మాజీ ఎమ్మెల్యేలు మల్లెల లింగారెడ్డి, నంద్యాల వరదరాజులరెడ్డిలను నియంత్రించడంపై ఆయా నేతల అనుచరులు ఆగ్రహోదగ్రులవుతున్నారు. కమలాపురంలో మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డితో ఏకాంతంగా చర్చలు జరపడం, టీడీపీ బహిష్కృత నేతలు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, సాయినాథ్‌శర్మలను లోకేష్ టెంట్‌లోకి అనుమతించడంతో ఇన్‌చార్జిలు అటు పుత్తా నరసింహారెడ్డి, ఇటు పుట్టా సుధాకర్ యాదవ్‌లు రగిలిపోతున్నట్లు తెలుస్తోంది. కడపలో ఆలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి కుటుంబాన్ని నియంత్రించేందుకు కడప నేతలు ఏకమయ్యారని, నేతల మధ్య అనైక్యత స్పష్టంగా కన్పించిందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఏదిఏమైనా జిల్లాలో నారా లోకేష్ పాదయాత్ర ఓ ప్రహసనంలా ముగిసిందనడంలో సందేహం లేదు.

వేగవంతంగా భూపరిహారం చెల్లింపులు



తహసీల్దార్లతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: కడప–రేణిగుంట జాతీయ రహదారి 716కు సంబంధించి నిర్వాసితులకు భూపరిహారం చెల్లింపులను త్వరగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాయచోటి కలెక్టరేట్‌లో కడప–రేణిగుంట జాతీయ రహదారి 716 నిర్వాసితులకు భూపరిహారం పంపిణీ అంశంపై జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి తహసీల్దార్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఎన్‌హెచ్ 716కు సంబంధించి అవసరమైన మొత్తం 692.5 ఎకరాలు భూమి సేకరణ పూర్తయిందన్నారు. ఇందులో ఇప్పటి వరకు 1470 మంది నిర్వాసితులకు రూ. 63.42 కోట్లు చెల్లించారన్నారు. ఇంకా 585 మందికి దాదాపు రూ. 31 కోట్లు చెల్లింపులు చేయాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌ఓ సత్యనారాయణ, ఎన్‌హెచ్ డిప్యూటీ మేనేజర్ వెంకటరమణ, రాజంపేట డివిజన్ తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

వానపాముల ఎరువుల తయారీపై శిక్షణ

కడప అగ్రికల్చర్: కడప నగర శివార్లలోని ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో ఈనెల 15వ తేదీన వానపాముల ఎరువు తయారీపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య తెలిపారు.

క్లుప్తంగా

ఎర్రచందనం స్మగ్లర్ అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ పురుషోత్తంరాజు

ఒంటిమిట్ట : మండల పరిధిలో ఎర్రచందనం స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న బోయపల్లి గ్రామానికి చెందిన మీనిగ సుబ్రమణ్యం (32)ను అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ పురుషోత్తంరాజు మంగళవారం విలేకరుల సమావేశంలో నిందితుడిని హాజరు పరచి, వివరాలు వెల్లడించారు. నర్వకాటిపల్లి అటవీ ప్రాంతంలోని చిలకల బావి ప్రాంతంలో సుబ్రమణ్యం ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడుతుండగా దాడి చేసి, పట్టుకోవడం జరిగిందని తెలిపారు. అతని వద్ద నుంచి రెండు ఎర్రచందనం దుంగలతోపాటు, ఒక గొడ్డలి స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. నిందితుడు సుబ్రమణ్యంను రిమాండు తరలించినట్లు వివరించారు. సమావేశంలో ఎస్ఐ మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

పాత నేరస్తుల బైండోవర్



మదనపల్లె తహసీల్దార్ ఎదుట నిందితులను బైండోవర్ చేస్తున్న ఎస్ఈబీ అధికారులు

మదనపల్లె : మదనపల్లె ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ నేరాలకు సంబంధించి అరెస్ట్ అయిన పాత నిందితులను అన్నమయ్య జిల్లా అడిషనల్ ఎస్పీ వి.బి.రాజ్‌కమల్ ఆదేశాల మేరకు బైండోవర్ చేసినట్లు ఇన్‌చార్జి సీఐ శ్రీహరిరెడ్డి తెలిపారు. మంగళవారం మదనపల్లె, రామసముద్రం తహసీల్దార్‌లు షేక్ మహబూబ్ చాంద్, దైవరాజన్ ఎదుట ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో గతంలో నిషేధిత నాటుసారా, కర్ణాటక మద్యం, గంజాయి కేసుల్లో అరెస్ట్ అయిన మొత్తం 53 మందిని హాజరు పరిచినట్లు చెప్పారు. ఎక్సైజ్ నేరాలు విడిచిపెట్టి సత్ప్రవర్తనతో మెలగాలని వారు సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ అంజద్‌బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

రక్త సారథులు.. ప్రాణ వారధులు

నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం

మదనపల్లె సిటీ : రక్తం ఎంత విలువైందో అందరికీ తెలిసిందే. ఒక యూనిట్ రక్తంతో ఒకరి ప్రాణాలే కాపాడొచ్చు. అత్యవసర సమయంలోనే కాదు... పలువురు వ్యాధిగ్రస్తులకు పక్షం రోజులకోసారి రక్తం ఎక్కించాల్సిందే. లేకపోతే వారి ప్రాణాలకే ప్రమాదం. కరోనా సమయంలో తలసేమియా, సికల్‌సెల్ వ్యాధిగ్రస్తులు, గర్భిణులకు ఒక యూనిట్ దొరకడం ఎంత కష్టంగా మారిందో చూశాం. ఆరోగ్యకరమైన వ్యక్తి ప్రతి మూడు, ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చని వైద్యనిపుణులు చెబుతూనే ఉన్నారు. అయినా చాలా మంది వెనకడుగు వేస్తున్నారు. రక్తమిస్తే అనారోగ్యం పాలవుతామని అపోహ పడుతున్నారు. దీంతో రక్తనిల్వల కొరత ఎప్పుడూ ఏర్పడుతూనే ఉంది. బ్లడ్‌బ్యాంకు నిర్వాహకులు శిబిరాల నిర్వహణ, దాతల కోసం తరచూ పలు సంస్థలను కోరుతూనే ఉన్నారు. అయినా స్పందన అంతంత మాత్రమే లభిస్తోంది. కొంత మంది దాతలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. రక్తదానం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇలాంటి వారు పలువురికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. బుధవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం.

ఇవ్వడమే కాదు.. ఇప్పిస్తారు

రక్తం ఇవ్వడమే కాదు. అవగాహన కల్పించి ఇతరులతో ఇప్పించడం కూడా గొప్ప విషయమే. ఈ విషయంలో రెండో కోవకు చెందుతారు అబూబకర్‌సిద్దిక్. మదనపల్లె పట్టణంలో హెల్పింగ్‌మైండ్స్ సంస్థను ఏర్పాటు చేశారు. తరచూ రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తారు. అంతే కాకుండా అత్యవసర సమయంలో ఎవరైనా ఫోన్ చేస్తే వారికి రక్తం ఇస్తారు. ఇప్పటి రకు 38 సార్లు రక్తదానం చేశారు. సంస్థ తరపున పదేళ్లలో సుమారు 18 వేల మందితో రక్తదానం చేయించారు.



రక్తదానం చేస్తున్న అబూబకర్‌సిద్దిక్

చిరు వ్యాపారి.. రక్తదానంలో మేటి

మదనపల్లె పట్టణానికి చెందిన హర్షద్‌అలీ చిరు వ్యాపారం చేస్తూ జీవిస్తున్నాడు. స్నేహితుడు అనారోగ్యం పాలవడంతో ఓ గ్రూపు రక్తం అవసరం కావడంతో దొరకపోవడం వల్ల ఇబ్బందులు పడ్డాడు. అప్పటి నుంచి రక్తంతో ఎవరూ ఇబ్బందులు పడకూడదని రక్తదానం చేస్తున్నారు. ఇప్పటి వరకు 44 సార్లు రక్తదానం చేశారు.



రక్తదానం చేస్తున్న మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెకు చెందిన పుష్పా

ఆపద వస్తే .. వాలిపోతాడు

స్వర్ణకారుడిగా పని చేస్తూ స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్నాడు మదనపల్లె పట్టణానికి చెందిన ఢంకనాచారి. ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేసే తృప్తిలో ఎక్కడా ఉండదని నమ్మిన యువకుడు. బ్లడ్ బ్యాంకులో తన ఫోన్ నంబర్ ఇచ్చాడు. అత్యవసరమైతే ఫోన్ చేస్తే చాలు రక్తదానం చేస్తున్నాడు. ఇప్పటి వరకు 45 సార్లు రక్తదానం చేసి అందరి మన్ననలు పొందాడు.

చదువుకుంటూ.. రక్తదాతగా

మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెకు చెందిన పుష్ప తిరుపతిలో ఫుడ్ టెక్నాలజీ కోర్సు చదువుతోంది. రక్తదానం చేయడం వల్ల ప్రాణాలు కాపాడవచ్చునని తెలుసుకుంది. ఎవరికైనా ఆపద వస్తే చాలు రక్తదానం చేస్తుంది. ఇప్పటి వరకు ఆరు సార్లు రక్తదానం చేసింది. రక్తదానం చేయడమే కాకుండా సహ విద్యార్థినులకు రక్తదానం గురించి అవగాహన కల్పిస్తుంది.

స్ఫూర్తి ప్రదాత శివాజీ

డిగ్రీ చదువుతూ రక్తదానం చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెకు చెందిన శివాజీ. వివేకా ఆశయ ఫౌండేషన్ తరచూ నిర్వహించే రక్తదాన శిబిరాలు ఏర్పాటులో సహాయ, సహకారాలు అందిస్తున్నాడు. ఇప్పటి వరకు 11 సార్లు రక్తదానం చేశారు. రక్తదానం గురించి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చూస్తూ..

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తూ సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నాడు మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెకు చెందిన శివ. ఉద్యోగం చేస్తూ రక్తదాన శిబిరాలు నిర్వహిస్తే స్వచ్ఛందంగా రక్తదానం చేస్తున్నారు. ఇప్పటి వరకు ఆరు సార్లు రక్తదానం చేశారు.

డ్రిప్ పరికరాల దగ్ధం

కలకడ : డ్రిప్ పరికరాలు దగ్ధం కావడంతో రూ.2 లక్షల వరకూ నష్టం వాటిల్లినట్లు రైతు రామలింగయ్యనాయుడు తెలిపారు. మండలంలోని కె.బాటవారిపల్లె పంచాయతీ పోతువారిపల్లె రోడ్డు వద్ద నివాసం ఉన్న సుందరమ్మ-రామలింగయ్య నాయుడు దంపతులు వారి పంట భూమిలో ఏర్పాటు చేసుకున్న డ్రిప్ పైపులు, టమాట కర్రలు, నీటిపైపులు, గేట్‌వాల్వ్‌లు, మోటార్‌సామగ్రి మంగళవారం పూర్తి కాలిపోయాయి. మధ్యాహ్నం తాము ఇంటిలో నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టినట్లు బాధితులు తెలిపారు. కర్రలకు నిప్పు అంటించడంతో 10 ఏళ్ల వేప చెట్టు కూడా పూర్తిగా కాలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆకతాయిలు ఆగడాలను అరికట్టాలని వారు కోరారు.



కాలిపోయిన డ్రిప్ పైపులు, కర్రలు

ప్రైవేట్ బస్సులో నుంచి జారిపడి కండక్టర్ మృతి

మదనపల్లె : వేగంగా వెళుతున్న ప్రైవేట్ బస్సులో నుంచి జారిపడి కండక్టర్ మృతి చెందిన సంఘటన మంగళవారం మదనపల్లె మండలంలో జరిగింది. వాల్మీకిపురం మండలం నాయకవీధికి చెందిన పి.జాఫర్‌ఖాన్(65) ప్రైవేట్ బస్సు కండక్టర్‌గా పని చేస్తూ జీవిస్తున్నాడు. దాదాపు 30 ఏళ్లకు పైబడి ఈ వృత్తినే నమ్ముకుని జీవనం చేస్తున్నాడు. ప్రస్తుతం చింతామణి-కదిరి మధ్య నడిచే ఎస్.వి.ఎం.ఎస్ ప్రైవేట్ బస్సులో పని చేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం 4.30 గంటలకు మదనపల్లెలోని బెంగళూరు బస్టాండు నుంచి ఎస్.వి.ఎం.ఎస్. బస్సు ప్రయాణికులతో చింతామణికి బయలుదేరింది. మదనపల్లె-బెంగళూరు రహదారిపై చిప్పిలి సమీపంలోని ఆంజనేయస్వామి గుడి వద్ద బస్సుకు ఎదురుగా ద్విచక్రవాహనం అడ్డురావడంతో డ్రైవర్ సడెన్ బ్రేక్ వేశాడు. దీంతో బస్సులో డోర్‌కు ఆనుకుని టికెట్లు తీసుకుంటున్న కండక్టర్ జాఫర్‌ఖాన్ ఒక్కసారిగా పట్టుతప్పి ప్రమాదవశాత్తు బస్సులో నుంచి కిందపడ్డాడు. ఘటనలో తల వెనుకవైపున తీవ్ర గాయం కావడంతో అధిక రక్తస్రావం జరిగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. బస్సు క్లీనర్, డ్రైవర్‌లు గాయపడిన కండక్టర్ జాఫర్‌ఖాన్‌ను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే కండక్టర్ మృతి చెందినట్లు నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. బతుకుదెరువుకు కండక్టర్ వృత్తిని ఎంచుకుని 30 ఏళ్లుగా పనిచేస్తూ, జీవనానికి ఆధారమైన బస్సులోనే విధి నిర్వహణలో జాఫర్‌ఖాన్ ప్రాణాలు కోల్పోవడంపై బంధువులు, కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. తాలూకా ఎస్ఐ వెంకటేష్ ప్రమాద స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. మృతుడు జాఫర్‌ఖాన్‌కు భార్య మెహర్‌జాన్‌తోపాటు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.



మృతి చెందిన జాఫర్‌ఖాన్

రూ.32 కోట్లతో కేసీ కాలువ పనులు

మైదుకూరు : జిల్లాలో భారీ సాగునీటి ప్రాజెక్టుల్లో ఒకటైన కేసీ కాలువకు రూ.32 కోట్లతో పనులు నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో ఆయకట్టు రోడ్ల పనులకు టెండర్లు కూడా పూర్తయ్యాయి. మైదుకూరు సబ్ డివిజన్ పరిధిలోని మైదుకూరు, దువ్వూరు, చాపాడు, ఖాజీపేట మండలాల్లో ఇడమడక, చింతకుంట, కొత్తపల్లె, భాకరాపురం ప్రాంతాల్లో ఆయకట్టు రహదారులు, జీప్ ట్రాక్స్‌లను ఏర్పాటు చేయడం, మరమ్మతులు చేపట్టడం కోసం రూ.23.12 కోట్లతో పనులు చేపట్టనున్నారు. అదే విధంగా మైదుకూరు, చాపాడు, దువ్వూరు ఖాజీపేట మండలాల్లో కేసీ ప్రధాన కాలువకు దెబ్బతిన్న లైనింగ్‌కు మరమ్మతులు, కల్వర్టులు ఏర్పాటు చేయడం, సీసీ వాల్స్, గైడ్ వాల్స్, స్లూయిసుల ఏర్పాటు, మైదుకూరు, ప్రొద్దుటూరు, ఖాజీపేట కేసీ కాలువ కార్యాలయాల్లో రక్షణ గోడలకు మరమ్మతు పనులు నిర్వహించేందుకు రూ.8.87 కోట్లతో అంచనాలు పంపారు. రానున్న సీజన్‌లో ఆయకట్టుకు సాగు నీటిని అందించేందుకు ఎలాంటి అవరోధాలు లేకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఎఫ్‌సీలేని స్కూల్ బస్సులు సీజ్ చేస్తాం

బి.కొత్తకోట : అన్నమయ్య జిల్లాలో రవాణశాఖ ఫిట్‌నెట్ సర్టిఫికేట్ లేకుండా రోడ్లపై తిరిగే స్కూల్ బస్సులను సీజ్ చేస్తామని రవాణాశాఖ జిల్లా స్క్వాడ్ అధికారి ఎం.అజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన బి.కొత్తకోటలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. స్థానిక ప్రయివేటు పాఠశాలలకు చెందిన మూడు బస్సులపై కేసులు నమోదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడుతో వెళ్తున్న వాహనాలకు రూ.1.95 లక్షల జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరులో ఒకటి, మదనపల్లెలో ఒకటి, రాయచోటిలో ఒకటి స్కూల్ బస్సులపై కేసులు నమోదు చేశామని చెప్పారు. జిల్లాలో 722 స్కూల్ బస్సులు ఉండగా 480 బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు మంజూరైనట్టు తెలిపారు. ఇంకా 240 బస్సులను ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పొందాల్సి ఉందని చెప్పారు. ఈ బస్సులు ఎస్‌ఫీలు పొందకుండా రోడ్లపై కనిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరిగినా అందుకు యాజమాన్యాలదే బాధ్యత అని స్పష్టం చేశారు. నిబంధనలు పాటించకుండా నడిచే వాహనాలు, రవాణా వాహనాలపై దాడులు నిర్వహిస్తున్నామని చెప్పారు. దాడుల ద్వారా ఏప్రిల్‌లో రూ.30 లక్షలు, మేలో రూ.18 లక్షలు, జూన్‌లో ఇప్పటి వరకు రూ.9 లక్షలు వసూలు చేసినట్టు పేర్కొన్నారు. అధికలోడుతో వాహనాలు వెళ్తున్న మార్గాలను గుర్తిస్తున్నామని, ఈ ప్రాంతాల్లో ఆకస్మిక దాడులు నిర్వహిస్తామని వివరించారు.



రవాణాశాఖ జిల్లా స్క్వాడ్ అధికారి అజయ్‌కుమార్

కుక్కల దాడిలో 30 గొర్రెల మృతి

బి.కొత్తకోట : కంచెలోని మందపై కుక్కలు దాడి చేయడంతో 30 గొర్రెలు మృతి చెందాయి. మంగళవారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘటనలో రూ.3 లక్షల నష్టం వాటిల్లింది. బాధితుడు పి.వెంకటరమణ కథనం మేరకు వివరాలు.. మండలంలోని బడికాయలపల్లెకు చెందిన వెంకటరమణ గొర్రెలు మేపుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం రాత్రి ఊరి పొలిమేరలోని ఇంటి ఆవరణలో ఉన్న కంచెలో 42 గొర్రెల మందను తోలాడు. తిరిగి బడికాయలపల్లెలోని ఇంటికి వచ్చి నిద్రపోయాడు. మంగళవారం ఉదయం మంద వద్దకు వెళ్లగా 30 గొర్రెలు చనిపోగా, ఏడు గొర్రెలకు గాయాలైనట్లు గుర్తించాడు. రాత్రి వేళలో మందపై మూడు కుక్కలు దాడి చేసి విచక్షణారహితంగా కొరికి చంపేశాయి. ఈ మూడు కుక్కలు మంద నుంచి పొలాల్లోకి వెళ్తుండటం స్థానికులు గుర్తించారు. తీవ్రంగా గాయపడిన గొర్రెలను చికిత్స కోసం బి.కొత్తకోట పశువైద్య కేంద్రానికి తరలించారు. చనిపోయిన 30 గొర్రెలకు పశు వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు. బాధితుని వినతి మేరకు తహసీల్దార్ రఫీక్ అహ్మద్ విచారణ జరిపారు. బాధితునికి న్యాయం జరిగేందుకు ఉన్నతాధికారులకు నివేదిక పంపుతున్నట్లు ఆయన చెప్పారు. గొర్రెల మృతితో ఆధారం కోల్పోయానని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.



మృతి చెందిన గొర్రెలు

పాముకాటుతో రైతుకు అస్వస్థత

మదనపల్లె : పాముకాటుతో రైతు తీవ్ర అస్వస్థత పాలైన సంఘటన మంగళవారం మదనపల్లె మండలంలో జరిగింది. కొత్తవారిపల్లె పంచాయతీ ఎల్లూరివారిపల్లెకు చెందిన రైతు హరినాథరెడ్డి(43) పొలం వద్ద పశువులకు గడ్డికోస్తుండగా పాము కాటేసింది. ఘటనలో బాధితుడు తీవ్ర అస్వస్థతకు గురవగా, కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం కోలుకుంటున్నాడు.

ట్రాక్టర్ ప్రమాదంలో యువ రైతు మృతి

కురబలకోట : ట్రాక్టర్ నడుపుతూ ప్రమాదవశాత్తు యువరైతు మృతి చెందిన సంఘటన మంగళవారం కురబలకోట మండలంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబీకులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. మండలంలోని వనమరెడ్డిగారిపల్లెకు చెందిన యువ రైతు సతీష్ కుమార్‌రెడ్డి (24) పక్క గ్రామమైన కట్టకిందపల్లెకు పొలం దున్నడానికి వెళ్లాడు. ట్రాక్టర్ తోలుతున్న అతను ప్రమాదవశాత్తు అదుపు తప్పి కింద పడిపోయాడు. హుటాహుటిన మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ముదివేడు పోలీసులు తెలిపారు.



మృతి చెందిన సతీష్‌కుమార్‌రెడ్డి

ఆటో బోల్తా.. వ్యక్తి మృతి

వాల్మీకిపురం : ఆటో బోల్తా పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని తాటిగుంటపల్లి పంచాయతీ దొడ్ల డెయిరీ దగ్గర మంగళవారం చోటు చేసుకొంది. వివరాలు.. కంభంవారిపల్లి మండలం సొరకాయలపేట పంచాయతీ మినిమిరెడ్డిగారిపల్లికి చెందిన రమణ (48) ఎర్రగడ్డల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఇదే ప్రాంతానికి చెందిన డ్రైవర్ సంజీవ (36)కు చెందిన ఆటోను బాడుగకు తీసుకొని మంగళవారం మదనపల్లి నుంచి ఎర్రగడ్డల లోడును వేసుకొని ఇరువురు కంభంవారిపల్లికి బయల్దేరారు. మార్గంమధ్యలోని దొడ్ల డెయిరీ వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వెనుక వైపు కూర్చొని ఉన్న రమణ కిందపడటంతోపాటు అతనిపై ఎర్రగడ్డల మూటలు పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో డ్రైవర్ సంజీవ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. రమణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వాల్మీకిపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్సై నాగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన రమణ

లారీలు ఢీకొని ఒకరి మృతి

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని చిలంకూరు- నిడుజివ్వి గ్రామాల మధ్య సోమవారం అర్ధరాత్రి 12 గంటల ప్రాంతంలో రెండు లారీలు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న వెంటనే సంఘటన స్థలాన్ని ఎర్రగుంట్ల పోలీసులు పరిశీలించి ఏర్పడిన ట్రాఫిక్‌ను తొలగించారు. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఖాజీపేట మండలం చెముళ్లపల్లె గ్రామానికి చెందిన మద్దూరు శివారెడ్డి (31) తన మినీ లారీలో ఖాజీపేట మండలం కొత్తపల్లె నుంచి చెరుకు గడ్డల లోడును నార్పలకు తీసుకొని వెళ్తున్నాడు. ముద్దనూరు వైపు నుంచి మరో లారీ వస్తోంది. ఎదురెదురుగా వస్తున్న- వెళ్తున్న ఈ లారీలు ఎర్రగుంట్ల మండలం కడప- తాడిపత్రి జాతీయ రహదారిపై చిలంకూరు- నిడుజివ్వి గ్రామాల మధ్య ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో శివారెడ్డి అనే వ్యక్తి మినిలారీలోనే చిక్కుకుని పోయినాడు. లారీడ్రైవర్ వరదజాన్‌కు, మినీ లారీలో ఉండే శరత్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ విషయం తెలిసిన వెంటనే ఎర్రగుంట్ల ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. మినీ లారీలో చిక్కుకున్న శివారెడ్డిని అతికష్టం మీద బయటకు తీసి 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మిగిలిన ఇద్దరిని కూడా అదే వాహనంలో తరలించారు. అయితే చికిత్స పొందుతూ శివారెడ్డి అనే వ్యక్తి మృతి చెందాడు. మృతుడి తండ్రి రమణారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో దంపతులు తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం కురబలకోట మండలంలో జరిగింది. ముదివేడు పంచాయతీ పిచ్చలవాండ్లపల్లెకు చెందిన పవన్‌కుమార్, ప్రియాంక(23) గుర్రంకొండలో భవన నిర్మాణ పనులు చేసేందుకు ద్విచక్రవాహనంలో బయలుదేరారు. మార్గంమధ్యలో ముదివేడు సమీపంలో ఎదురుగా టెంపో వేగంగా రావడంతో వాహనాన్ని తప్పించపోయి అదుపుతప్పి కిందపడ్డారు. ప్రమాదంలో దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రియాంక పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

చెట్టుపై నుంచి పడి..

నిమ్మనపల్లె : చెట్టుపై నుంచి పడి బాలిక తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. బండ్లపై పంచాయతీ దుర్గంవారిపల్లెకు చెందిన డి.చంద్ర కుమార్తె డి.లిఖిత(9) తల్లిదండ్రులతో కలిసి పొలం వద్దకు వెళ్లింది. తండ్రి టమాట పంటకు మందు పిచికారీ చేస్తుండగా బాలిక అల్లనేరేడు కాయలు కోసేందుకు చెట్టుపైకి ఎక్కింది. కాయలు కోసే క్రమంలో చెట్టు పెళుసుగా ఉండటంతో కొమ్మ విరిగి బాలిక కిందపడింది. దీంతో చేయి విరిగి తీవ్రగాయాల పాలైంది. తల్లిదండ్రులు వెంటనే నిమ్మనపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్సల అనంతరం మెరుగైన చికిత్సలకైమదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఘనంగా మేడా రఘు జన్మదిన వేడుకలు

రాజంపేట : రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి సోదరుడు ఎంఆర్‌కేఆర్ సంస్థ అధినేత మేడా రఘునాథరెడ్డి జన్మదిన వేడుకలను హైదరాబాదులోని బంజరాహిల్స్‌లో ఎంఆర్‌కేఆర్ సంస్థ ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. చైర్మన్ మేడా రఘునాథ్‌రెడ్డి నిండు నూరేళ్లు ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటూ, శుభాకాంక్షలను తెలుపుతూ బర్త్‌డే కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌కేఆర్ సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే కడపలోని ఎంఆర్‌కేఆర్ కార్యాలయంలో నందలూరు సింగల్ విండో అధ్యక్షుడు పాలగిరి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మేడా రఘునాథ్‌రెడ్డికి పుట్టిన రోజు శుభాకాంక్షలను తెలియజేశారు. పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంఆర్‌కేఆర్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

అబ్బాయికి బాబాయ్ శుభాకాంక్షలు: అన్న కుమారుడు మేడా రఘునాథ్‌రెడ్డికి బాబాయి, నందలూరు ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలను తెలిపారు. ఆ దేవదేవుని ఆశీస్సులు రఘుకు నిండుగా ఉండాలని ఆయన కోరారు. సంఘసేవకునిగా తనకుంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్న రఘుకు ప్రజలు ఆశీర్వాదాలు అందించాలని కోరారు.



ఎంఆర్‌కేఆర్ సంస్థ ప్రధాన కార్యాలయంలో జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న అధికారులు

అక్రమ గ్యాస్ సిలిండర్ల పట్టివేత

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని మెయిన్ రోడ్డులో ఉన్న ఓ ఎలక్ట్రికల్ షాపులో రమణారెడ్డి అనే వ్యక్తి అక్రమంగా నిల్వ ఉంచిన 19 గ్యాస్ సిలిండర్లను పట్టుకున్నామని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ గోవిందరావు మోరే తెలిపారు. మంగళవారం రమణారెడ్డి ఇంట్లో తనిఖీలు నిర్వహించగా.. 14 డొమెస్టిక్ సిలిండర్లు, ఐదు కమర్షియల్ సిలిండర్లు లభించాయని.. వాటిని సీజ్ చేసి 6ఏ కింద కేసు నమోదు చేశామని డీటీ పేర్కొన్నారు. గ్యాస్ సిలిండర్లను అక్రమంగా నిల్వ ఉంచి అమ్మితే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.